క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు సోమవారం మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. ఈ కౌన్సిల్ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని కౌన్సిల్ సభ్యులందరు సమయ పాలన పాటించి కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

చెన్నకేశవస్వామి సన్నిధిలో మాలధారులకు అన్నదానం

కారెంపూడి: ప్రసిద్ధ శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో అయ్యప్ప మాల, ఆంజనేయస్వామి మాల ఇతర దైవ మాలలు ధరించిన భక్తులకు అన్నదాన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. అయ్యప్ప దీక్షలు ముగిసేంతవరకు మండలం రోజులు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు తెలిపారు. దాతల సహకారంతో గత కొన్నేళ్లుగా జరుగుతున్న విధంగానే ఇప్పుడు కూడా చెన్నకేశవుని సన్నిధిలో అన్నదానం నిర్వహించాలని సంకల్పించి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో గురుస్వామి సింగం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కవి సమ్మేళనానికి కారెంపూడి టీచర్‌కు ఆహ్వానం



కారెంపూడి: తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో నవంబర్ ఐదో తేదీన భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ స్థాయి శతాధిక కవి సమ్మేళనానికి హాజరు కావాల్సిందిగా స్థానిక ఎంపీపీ మెయిన్ స్కూలు ఉపాధ్యాయుడు బి.మాన్‌సింగ్ నాయక్‌కు సోమవారం సాహిత్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ నుంచి ఆహ్వానం అందింది. మాన్‌సింగ్ నాయక్ పలు పత్రికలకు బాలల కథలు రాయడంతో పాటు బాలల కథల సంపుటిని ప్రచురించారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, ఆ పాఠశాల హెచ్‌ఎం పుల్లమ్మ, ఎంఈఓ రవికుమార్ ఆయనకు అభినందనలు తెలిపారు.

అనంతరామయ్యకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాళి



గురజాల : వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) తండ్రి అనంతరామయ్యకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, చంద్రగిరి ఏసురత్నంలు నివాళులర్పించారు. అనంతరామయ్య దశ దిన కర్మ కార్యక్రమాల్లో సోమవారం పాల్గొన్నారు. అనంతరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి , నియోజకవర్గంలోని మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామ సభలు

మాచవరం: పల్నాడు జిల్లా నీటి యాజమాన్య సంస్థ, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథక సంచాలకుల ఆదేశాల మేరకు మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పనులు గుర్తించి చేపట్టేందుకు నవంబర్ 1 నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్, ఏపీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో రెండు విడతలుగా గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని, పనులు గుర్తింపు అనంతరం 1 నుంచి 10 వరకు చివరి గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. 1 న పిల్లుట్ల, కొత్తగణేశునిపాడు, 2న గంగిరెడ్డిపాలెం, మాచవరం, 3న కొత్తపాలెం, ఎస్టీ తండా, 4న మల్లవోలు, ఎస్టీ తండా, 6న పిన్నెల్లి, 7న శ్రీ రుక్మిణీపురం, తురకపాలెం, 8న రేగులగడ్డ, చెన్నాయపాలెం, 9న మోర్జంపాడు, 10న వేమవరం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

సర్వే వేగవంతం చేయాలి

శావల్యాపురం: ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన సర్వే పురోగతి వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో అన్నీ గ్రామాల్లోని వలంటీర్లు సంయుక్తంగా మొబైల్ యాప్ ఆరోగ్యశ్రీ కార్డు కల్గియున్న ప్రతి ఇంటిలోని వారందరు సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ కార్డు కల్గిన కుటుంబ సభ్యులకు భారతదేశంలో ఏరాష్ట్రంలోనైనా రూ. 5 లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా అందుతాయన్నారు. అలాగే కార్డు కల్గియున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులచే ఈకేవైసీ నమోదు తప్ప నిసరిగా చేయించాలన్నారు. అనంతరం గ్రామసచివాలయ వైద్య ఆరోగ్య సిబ్బందితో మాట్లాడి క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు.

ప్రజలందరి ఆరోగ్యమే సీఎం జగన్ లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆంజనేయులు



బీపీ చెక్ చేయించుకుంటున్న పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు

మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి

పిడుగురాళ్ల: ప్రజలందరి ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీలో సోమవారం 4వ సచివాలయం పరిధిలోని 6, 7 వార్డు ప్రజలకు పార్క్ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి హాజరై వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రజలకు రాగి జావను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు శ్రీరామ రక్షగా మారిందన్నారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని, ప్రజల వద్దకే వైద్యులు వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నారన్నారు. అంతే కాకుండా మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రులకు సిఫారసు చేసి వారికి మెరుగైన ఉచిత వైద్యం జగనన్న ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్య శిబిరానికి వచ్చే వారికి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఓపీ నమోదు నుంచి వైద్య సేవలు పొంది మందులను ఉచితంగా తీసుకునేంతవరకు అన్నీ క్రమ పద్ధతిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిబిరానికి సుమారు 385 మంది హాజరై వైద్య సేవలు పొంది, ఉచితంగా మందులు స్వీకరించారని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అజ్మీరా శారద, కత్తెరపు వాసుదేవరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకయ్య, జాఫర్, చల్లగుండ్ల సంతోషరావు, కొమ్ము కల్యాణ్, ప్రేమానందం, ఆనంద్, వైద్యులు డాక్టర్ బి.మణికంఠ, అనిల్‌కుమార్, అశోక్‌కుమార్, ఆంజనేయులు, షేక్ షాహిద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న కుమారి, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆరోగ్యసిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



దమ్మాలపాడులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): ఎరువుల దుకాణాల్లో నిల్వ వివరాలను అందరికీ కనిపించేలా అందుబాటులో నోటీసు బోర్డుపై ఉంచాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని మాదల, దమ్మాలపాడు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులను అమ్మాలని, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందితే సంబంధిత దుకాణ లైసెన్స్ రద్దు చేయటంతో పాటు దుకాణదారునిపై చర్యలు తీసుకుంటామన్నారు. నోటీసు బోర్డులో స్టాక్‌తో పాటు ధరల వివరాలు కూడా ఉంచాలని సూచించారు. సీజన్‌కు సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ బిల్లు అందించాలన్నారు. దుకాణంలోని స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఆమెతో పాటు వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు



నకరికల్లు: స్థానిక గంగమ్మతల్లి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు 41రోజుల పాటు ఉచిత భిక్ష ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం భిక్ష ఏర్పాట్లలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నకరికల్లు గ్రామంతో పాటు సమీప గ్రామాల్లోని పలువురు మాలధారులు భిక్ష కార్యక్రమంలో పాల్గొంటున్నారు. రోజుకు సుమారు 150 నుంచి 200 మంది అయ్యప్పలు భిక్షకు హాజరవుతున్నారని భక్తసంఘం వారు తెలిపారు. మాలధారులు, గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమం ముందుకు సాగుతుందన్నారు. సోమవారం మామిడిశెట్టి సుబ్బారావు కుటుంబసభ్యులు భిక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మృతి చెందిన రోజే వైఎస్సార్ బీమా మంజూరు

తక్షణ సహాయంగా రూ.10వేలు అందజేత



వైఎస్సార్ బీమా చెక్కు అందజేస్తున్న సర్పంచ్ సుభాని, వైఎస్సార్ సీపీ నాయకులు

అచ్చంపేట: మండలంలోని కస్తల గ్రామానికి చెందిన గుడేటి అప్పారావు(62) గుండెజబ్బుతో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. వెంటనే వలంటీరు ద్వారా సచివాలయ సిబ్బంది స్పందించి వైఎస్సార్ బీమా లక్ష రూపాయలు మంజూరు చేశారు. తక్షణ సహాయంగా గ్రామ సర్పంచ్ షేక్ మహబూబ్ సుభాని రూ.10 వేలు మృతుని భార్య గుడేటి మరియమ్మకు అందచేశారు. మిగిలిన రూ.90 వేలు త్వరలో అందచేస్తామని చెప్పారు. మృతి చెందిన రోజే బీమా మంజూరు కావడం గతంలో ఎన్నడూ లేదని, మండలం చుట్టూ తిరిగి విసిగిపోయే పరిస్థితులుండేవని సర్పంచ్ అన్నారు. కానీ సీఎం జగన్ దయవల్ల గ్రామంలోనే సచివాలయం ఉండటం, వలంటీర్ వ్యవస్థ వల్లనే ఈ సౌలభ్యం కలిగిందని సర్పంచ్ తెలిపారు. ఆయన వెంట గ్రామ పార్టీ కన్వీనర్ చెన్నమల్లు రవి, షేక్ జాన్‌సీరా, హస్సన్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గురు స్పందన పురస్కారాలు అందజేత



పెదకూరపాడు: ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన గురు స్పందన పురస్కారానికి 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, పెదకూరపాడు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ ఎంపికయ్యారు. ఎమ్మెల్సీ సాజ్జి, ఏలూరు జిల్లా విద్యా శాఖ అధికారి శ్యామ్ సుందర్, ఫౌండేషన్ చైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి, పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి, రమణలను పల్నాడు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు తిరుమలేష్, శ్రీనివాసరెడ్డి, ప్రముఖ విద్యా వేత్త శివరామయ్య, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

త్రోబాల్ పోటీల్లో చిరుమామిళ్ల విద్యార్థిని సత్తా

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టులో స్థానం



బాదినేడి నాగతేజస్విని

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బాదినేడి నాగతేజస్విని రాష్ట్రస్థాయి త్రోబాల్ అండర్ 14 విభాగంలో సత్తా చాటింది. నాగతేజస్విని ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ నెల 27న తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్‌పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టులో పాల్గొని సత్తా చాటింది. మంచి ఆటతీరు కనబరచిన నాగతేజస్విని రాష్ట్రస్థాయికి ఎంపికైంది. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ఆడనుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హెచ్‌ఎం మల్లవరపు సుందరరావు, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

పసుమర్రులో...



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని పసుమర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై.హనుమంతరావు చెప్పారు. పసుమర్రులోని ఎస్‌ఎంకే జెడ్పీహైస్కూల్ విద్యార్థులు బాల్‌బాడ్మింటన్ అండర్–17లో ఈమని అమృత, అండర్–14లో షేక్ పర్వీన్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు నవంబర్ 4,5 తేదీలలో ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారు. ఈ విద్యార్థులకు సోమవారం పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్ వలి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ యర్రం వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ తన్నీరు నాగవర్థిని, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గద్దే హరిబాబు, గోపాళం మధుసూదనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రం కోశాధికారిగా రోశయ్య

వినుకొండ(నూజెండ్ల): శ్రీశైలంలో ఉన్న అఖిల భారత కుమ్మర శాలివాహన నిత్య అన్నదాన సత్రం కోశాధికారిగా వినుకొండ పట్టణానికి చెందిన బొంకూరి రోశయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీశైలంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రోశయ్య ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. కోశాధికారిగా ఎన్నికైన బొంకూరి రోశయ్యను రాష్ట్ర కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, కుమ్మరి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, భాస్కర శ్రీనివాసులు తదితరులు అభినందించారు. సత్రం అభివృద్ధికి కృషి చేస్తానని రోశయ్య తెలిపారు.

సీసీఐ కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ఆంధ్రయ్య



సీసీఐ కేంద్రం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న చైర్మన్ ఆంధ్రయ్య, అధికారులు

దాచేపల్లి : సీసీఐ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కలకండ ఆంధ్రయ్య అన్నారు. నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో సీసీఐ కేంద్రం ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలో పత్తిపంటను రైతులు అధికంగా పండిస్తారని, రైతులు పండించిన పత్తి పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సహకారంతో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రైతులు పత్తిపంటను సీసీఐ కేంద్రంలో విక్రయించేందుకు రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని, రైతుల వివరాలు సేకరించి తేదీల వారీగా పత్తిని సీసీఐలో కొనుగోలు చేస్తారని ఆయన తెలిపారు. నవంబర్ మొదటివారం నుంచి పత్తిని కొనుగోలు చేస్తామని, పత్తి విక్రయించిన రైతులకు వారం రోజుల్లో నగదు జమ చేస్తామని తెలిపారు. క్వింటాకు కనీస మద్దతు ధర రూ.7,020 ఇస్తున్నామని, రైతులు దళారుల చేతిలో మోసపోకుండా సీసీఐ కేంద్రంలో పత్తిని విక్రయించాలని కోరారు. ఈ సమావేశంలో యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు, యార్డు డైరెక్టర్లు కటికల సిల్వరాజు, చవ్వా శౌరెడ్డి, సూపర్‌వైజర్లు సాంబశివరావు, వెంగయ్య తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 11 మంది విద్యార్థులు ఎంపిక



ప్రతిభకనబరచిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

అచ్చంపేట: జిల్లా స్కూల్ గేమ్స్‌లో వివిధ క్రీడలలో మండలంలోని కొండూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి జట్టుకు 11 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ వి.వేమారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 28న మందపాడులో జరిగిన క్రీడలలో తమ పాఠశాల విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. పోటీలు అండర్ 14, 17 విభాగాలలో జరిగాయన్నారు. సాఫ్ట్‌బాల్‌లో ఎం.ఆకాష్, బి.దేవదాస్, ఎ.దేవమణి,, ఎస్.బుజ్జి, ఎ.కావేరీలు ఎంపికై నట్లు చెప్పారు. బేస్‌బాల్‌లో బి.అర్జునరావు, బి.శ్రీవిద్య, ఎం.రత్నకుమారి, ఎస్.గౌరిరేఖ, బి.దేవదాసు, వి.ఆకాష్ ప్రతిభ కనబరచి రాష్ట్ర జట్టుకు ఎంపికై నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలు త్వరలో అండర్ 14 బేస్‌బాల్ పోటీలు కర్నూలు జిల్లా నంద్యాలలో, అండర్ 17 బేస్‌బాల్ పోటీలు గుంటూరులో జరుగుతాయన్నారు. అండర్ 14, 17 సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రకాశం జిల్లా, ఒంగోలులో జరుగుతాయని చెప్పారు. విద్యార్థులను అభినందించిన వారిలో ప్రధానోపాధ్యాయులు బి.విజయకుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉన్నారు.

స్కూల్ గేమ్స్‌లో జెడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



పెదకూరపాడు: ఈనెల 28న నందిగామ జెడ్పీ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్–14, అండర్–19 హాకీ ఎంపికల్లో పెదకూరపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్–14కు షేక్ ఆసిఫా తబుసం, అండర్–19 విభాగంలో హారిక, షేక్ ఆసిఫాలు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమణ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర హాకీ క్రీడలకు ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, సర్పంచ్ జి.రాజు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ రఫీ, ఉపాధ్యాయులు అభినందించారు. ఎంపికైన విద్యార్థులు తుని మండలం నక్కపల్లి గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు తెలిపారు.

కరాటే నేషనల్ చాంపియన్ షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో అనుముల రాంబాబు, రామయ్య

సత్తెనపల్లి: గుంటూరు జిల్లా, మంగళగిరిలోని ఈద్గా షాదీఖానాలో కరాటే ఇన్విటేషనల్ నేషనల్ చాంపియన్‌షిప్ 29న నిర్వహించారు. ఈ టోర్నమెంటులో సత్తెనపల్లికి చెందిన షీకోకాయ్ షిటో రియో కరాటే స్కూల్ విద్యార్థులు 12 మంది ప్రతిభ చూపారు. వ్యక్తిగత బాలికల కటా విభాగంలో ఎస్.ఎస్.ఎస్. అక్షర(గోల్డ్ మెడల్), ఎస్.శరణ్య (గోల్డ్ మెడల్), టి.నిఖిత (సిల్వర్ మెడల్), బి.అక్షయ (బ్రాంజ్ మెడల్), వ్యక్తిగత బాలుర కటా విభాగంలో ఎల్. కిరీట్ (గోల్డ్ మెడల్), టి.అఖిల్ (గోల్డ్ మెడల్), ఎస్.సాయిరాం రెడ్డి (సిల్వర్ మెడల్), కె.టి.ప్రకాష్ (సిల్వర్ మెడల్), ఎల్.గేష్మఆషిత్ (బ్రాంజ్ మెడల్), ఎస్.కె.ఇదయతుల్లా (బ్రాంజ్ మెడల్), బి.సత్యనారాయణ (బ్రాంజ్ మెడల్), ఎ.పవన్‌చౌదయ్య (బ్రాంజ్ మెడల్)లు సాధించిన విద్యార్థులను సెన్సాయ్ అనుముల రాంబాబు, షిహాన్‌అనుముల రామయ్యలు సోమవారం అభినందించారు.

నీటి సమస్యకు పరిష్కారం

బొల్లాపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించామని గ్రామీణ నీటి సరఫరా ఏఈ పి. సురేష్ తెలిపారు. వర్షాభావంతో పలు గ్రామాల్లో బోర్లల్లో నీటి మట్టంతగ్గడంతో నీటి కొరత కొంత మేరకు ఏర్పడిందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కొన్ని గ్రామాల్లో కొత్త బోర్లు మోటార్లు ఏర్పాటు చేశామని చెప్పారు. పంచాయతీ, మండల పరిషత్, జెడ్పీ నిధులతో ఆయా గ్రామాలతో నూతన బోర్లు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఈ ఏడాది మార్చి ఏప్రియల్, మే, జూన్ నాలుగు నెలల కాలంలో నెలకొన్న నీటి సమస్యకు ట్రాన్స్‌పోర్టేషన్ ద్వారా నీటి సరఫరాతో గ్రామాలకు తాగునీరు అందించామన్నారు. ప్రస్తుతం మండలంలోని గండిగనుమలలో 20హార్స్‌పవర్ మోటరు ఏర్పాటు చేశామని, గుమ్మనంపాడు, రేమిడిచర్ల, అయ్యన్నపాలెం, హనుమాపురం, వెంకట రెడ్డిపురం, రావులాపురం గ్రామాలు, తండాల్లో నీటి కొరత లేకుండా బోరు, మోటర్లు ఏర్పాటు చేసి నీటి పరష్కారానికి కొంత మేర పరిష్కారం చూపామని ఏఈ తెలిపారు.

వాహనాలు తనిఖీ

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వ నిబంధనల మేరకు వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండాలని నరసరావుపేట డివిజన్ బ్రేక్ ఇన్‌స్పెక్టరు బి.సత్యనారాయణ ప్రసాదు అన్నారు. సోమవారం పట్టణంలో కారెంపూడి రహదారి మార్గంలో రవాణా శాఖాధికారులు, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ప్రసాదు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్టీసీ ఆదాయ పెంపుదలకు ప్రైవేట్ వాహనాల నియంత్రణకు తనిఖీలు చేశామన్నారు. అందులో భాగంగా 07 వాహనాలు తనిఖీలు చేయగా రూ. 40 వేలు అపరాధ రుసుం విధించామన్నారు. ఆయనతో పాటు డిపో మేనేజరు ఎం. కోటేశ్వరనాయక్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

యడ్లపాడు: గడ్డిమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...మండలంలోని సొలస గ్రామానికి చెందిన పేరం కోటేశ్వరమ్మ కొంతకాలంగా మధుమేహం, మూత్రపిండాల వంటి పలు వ్యాధులతో బాధపడుతోంది. అనారోగ్య సమస్యల కారణంగా ఈనెల 28న ఆమె ఇంట్లో గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు చిన్న వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి కేసులో నలుగురికి జైలు శిక్ష

శావల్యాపురం: భార్య భర్తలపై దాడికి పాల్పడిన ఘటనలో కోర్టులో నేరం రుజువు కావటంతో నలుగురికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ. 3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఎస్సై తుళ్ళురి తిరుపతిరావు వివ రాల మేరకు.. మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన వెలమవారిపాలెం గ్రామానికి చెందిన వంగా వెంకటేశ్వర రావు, వంగా హనుమంతరావు, వంగా కోటేశ్వర రావు, వంగా చిన వెంకటేశ్వర్లు అను వ్యక్తులు అదే గ్రామానికి చెందిన అమరవరపు తిరుపతిరావు అతని భార్య ధనలక్ష్మిలు స్థల వివాదంలో భార్యభర్తలను కర్రలతో కొ ట్టి గాయపరిచింది. ఈ సంఘటనలో అప్పటి ఎస్సై ఆర్ ఉమేష్ కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేయగా కేసు విచారణలో నేరం నిరూపణ కావటంతో వినుకొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి (న్యాయమూర్తి) యు.రామమోహన్ జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. ఇందులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దండే వెంకటేశ్వర్లు కేసును వాదించగా కోర్టు కానిస్టేబుల్ బి.శివనాగరాజులు సహాయ సహకారాలు అందించారన్నారు.

నలుగురు గేదెల దొంగలు అరెస్ట్



వినుకొండ(నూజెండ్ల): గేదెలను దొంగతనం చేస్తున్న నలుగురు వ్యక్తులను ఐనవోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఐనవోలు ఎస్ఐ జి.అనిల్‌కుమార్ కథనం ప్రకారం... కంభంపాటి ప్రభుదాసు (కొత్త త్రిపురాపురం), మందా వెంకయ్య (మతుకుమల్లి), కాకాని కోటయ్య (కంభంపాడు), కడియం కోటయ్య (మూగచింతలపాలెం)లు గేదెల దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరు వినుకొండ, నూజెండ్ల మండలాల్లో 4 గేదెలను దొంగతనం చేశారని, వీటి విలువ రూ. 2 లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను ఈ నెల 29వ తేదీన వినుకొండ మండలంలోని మదమంచిపాడు టెంపుల్ వద్ద అరెస్ట్ చేసి వినుకొండ కోర్టులో హాజరుపరచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు



నరసరావుపేట రూరల్: వ్యవసాయ అధికారులు సోమవారం పట్టణంలోని పురుగు మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. అనధికార పురుగు మందులపై వచ్చిన సమచారం మేరకు తనిఖీలు చేసినట్టు ఆమె తెలిపారు. అనధికార పురుగు మందులు కొనుగోలు చేయడం, విక్రయించడం నేరమని తెలిపారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో తప్పనిసరిగా ఇన్‌వాయిస్‌లు కలిగి ఉండాలని సూచించారు. ఇన్‌వాయిస్ లేకుండా పురుగు మందులు కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు మరో అవార్డు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండకు చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ గీసిన పల్లె పడతి అనే చిత్రానికి ఆర్ట్ లెజెండ్ గోల్డెన్ పద్మ అవార్డు లభించిందని జెస్టిస్ తెలిపారు. కోనసీమ చిత్రకళా పరిషత్, అమలాపురం వారు 2023 సంవత్సరంలో సెప్టెంబరు నెలలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో జెస్టిస్ గీసిన చిత్రానికి ఈ అవార్డు వచ్చినట్లు పరిషత్ నిర్వాహకులు కొరసాల సీతారామస్వామి ప్రకటించారన్నారు. అవార్డును అందుకు వజ్రగిరి జెస్టిస్‌ను పలువురు రాజకీయ ప్రముఖులు, కళాకారులు, కవులు, న్యాయవాదులు, పాస్టర్లు, ఉపాధ్యాయులు, ప్రముఖులు అభినందించారు.